# అమృతం

ఎమ్.వి.వి. సత్యనారాయణ

నిర్జనంగా ఉంది రోడ్డు. రాత్రి ఏడు దాటుతోంది. చలి కెరటం రోడ్డు మీదా, రోడ్డుకు రెండుపక్కలా చెట్ల మీదా, చెట్ల పక్కగా కట్టుకున్న చిన్న చిన్న చెక్క బడ్డీల మీద ప్రవహించి చుట్టల దుకాణం ముందు బల్లమీద చతికిలబడిపోయింది.

చుట్టల దుకాణంలో కిరసనాయిలు బుడ్డి వెలుగుతోంది. ఒక మోకాలు మడిచి రెండో కాలి మీద చతికిలపడి ముందుకు వంగాడు వీర్రాజు. ఎడమచేత్తో పొగాకు. పాయ విడదీస్తూ, కుడిచేత్తో వట్రు రేఖల్లాగా పాయను చీలదీస్తున్నాడు. అంచులు ఒత్తి పొగాకు రద్దు పేర్చుకుంటూ వట్రు రేఖను చాప చుట్టలాగా మడుస్తున్నాడు. చుట్ట చివర మైదాపిండి జిగురు అంటించి చివరలు కత్తిరించి నగిషీ చేశాడు.

చుట్టను చెక్క పెట్టెలోకి విసిరాడు. రోడ్డుమీద ప్రవహిస్తున్న చలి కెరటం అతని చాయల కూడా రానట్టుంది. అతనికి కూడా తన పనేమిటో, తానేమిటో అంతే. మొదటి ఆట సినిమా వదిలే వరకూ అతని ప్రపంచం అంతా చుట్టలతోనే.

కాలు మార్చుకుని కొత్త పొగాకు రెమ్మ అందుకున్నాడు వీర్రాజు.

ఎక్కడో చిన్నపిల్లవాడు ఏడ్చినట్టు సన్నటి ధ్వని.

అతను పట్టించుకోలేదు. దారిన పోయే ఏ కుర్రవాడో ఏడ్చి ఉంటాడని సరిపెట్టుకున్నాడు. కొంతసేపటికి ఏడుపు ధోరణి మారిపోయింది. కుయ్ కుయ్ మంటూ వినిపిస్తోంది.

చుట్టల దుకాణం ముందున్న బల్లమీద అప్పటికే చతికిలబడిన చలి పులి నోటికి చిక్కిపోయి ఆ ప్రాణి ఏడుపు మరీ ఎక్కువైపోయింది. వీర్రాజుకు ఇక తలెత్తి చూడక తప్పలేదు.

బల్లమీద తెల్లటి గుడ్డ కప్పినట్టు కనిపిస్తోంది. ఆ సాల్తీ చలికి గజగజ వణుకుతూండటం కూడా వీర్రాజుకు అర్థమవుతోంది. క్రమంగా వీర్రాజుకు అదో కుక్క అని కూడా అర్థమైంది. అది మామూలు కుక్క కూడా కాదు. బొచ్చుకుక్క!

వీర్రాజు చేతుల మీద ఆనుకుంటూ బడ్డీలోంచి దిగాడు. అతన్ని చూసి బొచ్చుకుక్క మరింత కుఁయ్ కుఁయ్ లాడింది. చేతులు చాపి బొచ్చుకుక్కను అందుకోబోయాడు వీర్రాజు. అది బల్ల మీద నుంచి కిందకి దూకి అతని కాళ్ళ మధ్య కలియ తిరుగుతోంది. తిరుగుతూ కూడా కుఁయ్ కుఁయ్ మంటోంది.

వీర్రాజుకు గిలిగింతలు పెట్టినట్టూ, చిన్న చిన్న గోళ్ళతో రక్కినట్టూ అటు సంతోషం, ఇటు రవంత బాధ కలిగాయి. కూర్చున్న మనిషి కాస్తా అప్పుడే సాగి నిలబడ్డాడేమో చలిగాడికి దొరికిపోయాడు. వణుకుతూ కిందకు వంగి బొచ్చుకుక్కను చేతుల్లోకి తీసుకున్నాడు.

ఇల్లు వదిలిపెట్టడమో, చలి విపరీతంగా ఆక్రమించడమో, కొత్త వ్యక్తి స్పర్శో దాని వణుకుకు కారణ మనుకున్నాడు వీర్రాజు. ముందుకు చేతులు చాపి బడ్డీలో నిలబెట్టాడు కుక్కను. ఏ కళ నుందో వణుకుతూ నిలబడింది. బుడ్డి దీపం వెలుతురు దానికి కాస్త ధైర్యం ఇచ్చినట్టుంది.


దాని మొహం. అందంగా ఉంది. మొహం మీదా, ఒంటినిండా ఉన్న బొచ్చు దానికి మరింత అందాల మంచు తరక లంటిస్తున్నాయి. జూలు మధ్య నుంచి దాని చిన్న అందమైన నేత్రాలు వెలుగు పడి నీలాల్లా మెరుస్తున్నాయి. ఎర్రటి చిన్న నోట్లో ఉండీ ఉండీ నాలుక మాయ మవుతోంది. బొచ్చు కుచ్చుల మధ్య దాని చెవులు ఇక కనిపించడమే లేదు.

మొదటిసారిగా వీర్రాజు ముచ్చట పడ్డాడు. ఎంత విలువైన కుక్క! ఎక్కడ నుంచి తప్పించుకు వచ్చేసిందో? దాన్ని యజమానికి ఎలా అందించగలడు? అందించలేకపోతే కుక్క బెంగ పెట్టుకునో, చలికి తట్టుకోలేకనో చచ్చిపోతుంది.

వీర్రాజు మనసు నీరసంగా మూలిగింది. గుండెలో బాధ రేగింది. ఇంత విలువైన కుక్క పిల్ల చనిపోవడానికి వీల్లేదు. అయితే దాని యజమాని ఎవరో తెలుసుకు అందించే వరకూ అయినా బతికించాలి. ఈ కుక్క ఏం తింటుందో తన కేం తెలుసు.

భార్య నూకాలమ్మకి తెలిసి ఉంటుంది. నూకాలమ్మ పెద్ద వాళ్ళ ఇళ్ళల్లో పని పాటలు చేస్తూంటుంది. ఎన్నో కుక్క పిల్లలను కూడా వాళ్ళ ఇళ్ళల్లో చూసి ఉంటుంది.

వీర్రాజు తిరిగి ఆసనం వేసి చుట్టలు చుట్టాలని ప్రయత్నించాడు కాని కుక్క చిన్నదో పెద్దదో చప్పుడు చేస్తూ అతని మనసును పని మీద లగ్నం కానిచ్చేది కాదు. దుకాణం సర్దుకుని బల్లమీద కుక్కను కూర్చోబెట్టాడు. బడ్డీ మూసి కుక్కను



ఎత్తుకుని రో డ్డెక్కాడు.

మొదటి ఆట సినిమా ఇంకా విడిచిపెట్టలేదు. రోడ్డుమీద ఇంకా జనసందడి మొదలు కాలేదు. ఎవరి వైపూ చూడకుండా ఇంటికి బయలుదేరాడు. ఇళ్ళ · వరసలు ప్రారంభమయ్యాయి..

వీధి కో ఎలక్ట్రిక్ బల్బ్ వెలిగించింది దిక్కుమాలిన మునిసిపాలిటీ. వీధుల్లో మురి క్కాలవల మధ్య చీకటి గుయ్యారాలూ, చెత్తకుప్పలూ, బీదా బిక్కీ జనం అడ్డదిడ్డంగా వేసుకున్న పుల్లల మోపులూ, బట్ట లారబెట్టుకునే తాళ్ళు - వీర్రాజు చిరాకు పడకుండా చీకట్లో తన ఇల్లు వెతికి పట్టుకుని ఇంటి ముం దాగాడు.

ఇంటి వెలువల చెత్త మంట పెట్టి నీళ్ళ కుండ వెచ్చపెడుతోంది నూకాలమ్మ.

"ఆకలేస్తందా వచ్చేశావ్?" అంది నూకాలమ్మ.

కొత్త మనిషిని చూసి కుక్క కుఁయ్ కుఁయ్ మంది జవా బిచ్చే బాధ్యత తానే అందిపుచ్చుకున్నట్టు.

"కుక్క పిల్లా! అనయ్యం బాబూ ... ఎందుకు తెచ్చావు?" దగ్గరకు రాబోయేదల్లా ఆగిపోయింది నూకాలమ్మ.

వీర్రాజు నొచ్చుకున్నాడు. తన భార్య మరీ అంత తేలికగా మాట్లాడకూడదు. ఎందుకు కుక్కను వెంటపెట్టుకు రావలసి వచ్చిందో తీరికగా తానే చెబుతాడు కదా! అయినప్పటికీ శాంతం తెచ్చుకున్నాడు.

"బడ్డీ కాడికి వొచ్చేసిందే! పాపం ... చలి ... ఎక్కడో బాగా తిన్న కుక్కే. దీని కర్మ కాలిపోయి మన బడ్డీకాడ వొణికిపోతుంటే ఎత్తుకు వచ్చాను. ఏదో రెండు ముద్దలు పెడితే రేపు పొద్దున్నే వాళ్ళ వాళ్ళెవరో వచ్చి తీసుకుపోతారు!"

నూకాలమ్మ కుక్క పిల్లను దగ్గరనుంచి చూసింది. "అన్నం ముద్దలు తిని సావ దిది!" అంది.

"కడుపులో మాడితే సరి అదే తింటుంది! నీళ్ళు తోడు. స్నానం చేస్తాను. కొబ్బరి తా డేదైనా పెట్టి దాన్ని రాటకు కట్టాలి."

నూకాలమ్మ మూతి తిప్పడం అతనికి తెలియదు.

***  **  **

తెల్లవారేటప్పటికి అరిచి అరిచి కుక్క నీరసించిపోయింది. రాత్రి నూకాలమ్మ చెప్పినట్టే కుక్క అన్నం ముద్దలు తినలేదు. అది తినకపోయేసరికి వీర్రాజూ అన్నం తృప్తిగా తినలేకపోయాడు. నూకాలమ్మ అప్పటికే ఎంగిలిపడిపోయింది కాబట్టి సరిపోయింది.

ఉదయం లేస్తూనే వీర్రాజు కుక్కతో సరికొత్త సమస్యను ఎదుర్కొన్నాడు. ఊర కుక్కలు అతని ఇంటి చుట్టూ చేరి మొరగడం మొదలుపెట్టాయి. ఒకటి రెండు కుక్కలైతే సాహసం చేసి ఇంట్లోకి చొరబడిపోయి బొచ్చు కుక్క పని పట్టబోయాయి. బొచ్చుకుక్కను రక్షించడం అతనికి తలకు మించిన బరువైపోయింది.

"పోతే పోనీయ్.. సంపి తినేస్తయి. అంతే కదా! మనం పెంచగలమా ఏమన్నానా? ఎవరిదో



దిక్కుమాలిన కుక్క మన ప్రాణానికి ఇక్కడికి వచ్చింది."

వీర్రాజుకు మళ్ళీ మనసు చివుక్కు మంది. తిండి లేక బొచ్చుకుక్క మాడిపోయింది.దా న్నింకా ఆడిపోసుకోవడం ఘోరమైన పాపం కిందే లెక్క. దాన్ని అని ఏం లాభం? దాన్ని వీధిలోకి నిర్లక్ష్యంగా వదలిపెట్టేసిన వాళ్ళ ననాలి.

చద్దన్నం తిన్నా ననిపించుకుని బొచ్చుకుక్కను వెంట పెట్టుకుని బడ్డీకి బయలుదేరాడు. భర్త చూడకుండా నూకాలమ్మ మూతిని వ్యంగ్యంగా తిప్పింది. ఆమె ఉద్దేశమే నిజమైంది. ఊర కుక్కలు వీర్రాజు వెంట పడ్డాయి. బొచ్చుకుక్కను ఇంట్లో విడిచిపెట్టి బడ్డీకి వెళ్ళక తప్పలేదు వీర్రాజుకు.

బడ్డీకి చుట్టల కోసం కిళ్ళీ కొట్ల కుర్రాళ్ళు వచ్చి వెళ్తున్నారు. వాళ్ళను అడగాలని సంశయించి చివరకు అడిగేశాడు.

"బొచ్చుకుక్క ఏం తింటుంది?" భావను కూడగట్టుకున్నాడు.

"మీకు బొచ్చుకుక్క ఎక్కడిది?" అడిగాడు.

వీర్రాజు చెప్పాడు. చెబుతూనే వాళ్ళను బతిమాలాడు "ఎవరిదైనా బొచ్చుకుక్క పోయిందేమో అడగండి. దాని ఇంటికి దాన్ని తిప్పి పంపేస్తే అంతకంటే ఏం కావాలి?"

వాళ్ళు తమకు తోచిన సలహా అల్లా అతని మొహాన కొట్టి వెళ్ళిపోయారు. ఫలితంగా బడ్డీ కట్టేసి కుక్క బిస్కట్ల వేటకి బయలుదేరాడు. ఇంటికి వెళ్ళి భార్యకు బిస్కట్లు అందించి నాలుగు చీవాట్లు తిని మళ్ళీ బడ్డీకి తిరిగి వచ్చాడు. దారి పొడుగునా భార్యను శపించుకొంటూనే ఉన్నాడు.

నూకాలమ్మకు ఏమీ తెలియడం లేదు. బక్క జీవాల మీద ఏ మాత్రం కనికరమూ, సానుభూతీ లేవు. బొచ్చుకుక్కకు మూడు రూపాయలు పెట్టి బిస్కట్స్ కొనిపెడితే ఏమైపోయింది? తన చుట్టల పని కొంత పాడైతే అయింది గాక! ఒక జీవికి ఆకలి బాధ తీరింది కదా!

బడ్డీలో కూర్చున్నాడన్న మాటే కానీ అతని మనసంతా ఇంటిమీదే ఉంది. బొచ్చుకుక్క అతని కళ్ళలో మెదులుతోంది. బొచ్చుకుక్క బిస్కట్లు తిన్నదో, లేదో అని బెంగపెట్టుకున్నాడు.

ఆలోచిస్తూంటే వీర్రాజుకే ఆశ్చర్యంగా ఉంది.

పూర్తిగా పదహారు గంటలు కూడా కాకుండానే బొచ్చుకుక్క తన మనసు మీద ఎంతటి బలమైన ముద్ర వేసిందో విచిత్రంగా ఉంది. మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి వచ్చేస్తుంటే బొచ్చుకుక్క అతని వెంట పడింది.

బొచ్చుకుక్కను వెంటపెట్టుకుని బడ్డీకి తిరిగి వచ్చాడు వీర్రాజు. ఊర కుక్కల నుంచి తప్పించుకు రావడం కష్టమైనా వీర్రాజు తన ప్రయత్నం మానుకోలేదు. బొచ్చుకుక్కను బడ్డీకి తీసుకురావడమే మంచి దనుకున్నాడు కూడా. అతని చుట్టల బడ్డీ ఎదుట ఖరీదైన విదేశీ కా రాగింది. ఆ కారులోంచి రంగు రంగుల జీన్స్ ధరించిన అమ్మడు దిగింది. రంగు కళ్ళాద్దాలు ఒకసారి కనుబొమల మీదికి జరిపి బడ్డీలోకి చూసింది. బొచ్చుకుక్కను చూసి మందహాసం చేసింది. తరువాత ఎత్తు మడమల జోళ్ళు చప్పుడు చేసుకుంటూ వీర్రాజును సమీపించింది.

"హలో!" అంది ఒయ్యారం ఒంపుతూ.

వీర్రాజుకు నోట మాట రాలేదు. బడ్డీ లోంచి దిగబోయాడు. బొచ్చుకుక్క కుఁయ్ కుఁయ్ మంటోంది. వీర్రాజు దాన్ని గుండెలకు అద్దుకుంటూ కిందకు దిగాడు.

"ఈ కుక్క మాది. రాత్రి తప్పిపోయింది" అంది ఒయ్యారాల అమ్మడు.

వీర్రాజు మొహంలో చాలా సంతోషం కనిపించింది. కుక్కకు తన యజమానురాలు దొరికింది. దాని సంరక్షణకు ఇక లోటు రాదు.

కుక్క నందుకుని అమ్మడి చేతుల కందించాడు వీర్రాజు.

బొచ్చుకుక్క ఆమె చేతుల్లో చిక్కినట్టే చిక్కి పక్కకు గెంతి వీర్రాజు పాదాలు నాకుతోంది.

వీర్రాజుకు కడుపులోంచి ఆత్మీయత భావం వెల్లువలా పొంగింది.

బొచ్చుకుక్క కెంత అభిమానం! ఎంత విశ్వాసం! కాని దాని నోటి దగ్గర కూడు తా నెక్కడ పారబోయగలడు?

కారు వెళ్ళిపోయింది.

**  **  **

ఇప్పుడు సత్తుగిన్నెలో అన్నం పెడుతుంది. కలుపుకోవడానికి ఇంత ద్రవం పోస్తుంది. బొచ్చుకుక్క ఆమె చీర కుచ్చెళ్ళను రాసుకుంటూ తిరిగేది కాస్తా మెల్లగా సత్తు గిన్నె వైపు కదులుతుంది.

వీర్రాజునూ, నూకాలమ్మనూ కళ్ళ నిండుగా చూస్తుంది. రెండు కతుకుల్లో సత్తు గిన్నెను ఖాళీ చేస్తుంది.

సత్తు గిన్నెలో నూకాలమ్మ కలిపే ద్రవం ఒట్టి గంజి అని బొచ్చుకుక్కకు తెలుసు. గంజిపోసే అమృత హస్తాలు కూడా దానికి తెలిసిపోయాయి.

★